# లింగాపుట్టుకు రక్షిత నీరు


ప్రారంభానికి సిద్ధమైన గ్రావిటీ నీటి పథకం


నీటిశుద్ధియంత్రాన్ని చూపుతున్న ఇంజినీర్లు

పాడేరు రూరల్,న్యూస్‌లైన్:

లింగాపుట్టు గ్రామంలో 12వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ గ్రామంలో కలుషిత నీటి ప్రభావంతో 21 మంది గిరిజనులు చనిపోయిన విషయం తెలిసిందే. గిరిజనులు, ప్రజా సంఘాల ఒత్తిడి మేరకు గ్రావిటీ పథకం ద్వారా రక్షి త నీటిని అందించేందుకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి పి. బాలరాజు చర్యలు చేపట్టారు. 12వ ఆర్థిక సంఘం నిధులు ₹ 9.5ల క్షలను మంజూరు చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులు చేపట్టింది. లింగాపుట్టుకు సమీపంలోని కొండ ప్రాంతంలో వృథాగా పోతున్న ఊట నీటిని గ్రామానికి తరలించేందుకు భారీ పైపు లైన్ ఏర్పాటు చేశారు.

కొండమీద ట్యాంక్‌ను నిర్మించారు. నాలుగు నెలల్లో ఈ పథకాన్ని పూర్తి చేయడం విశేషం. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.వి.సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధతో పనుల వేగవంతగా సాగాయి. కొండ నుంచి గ్రామానికి పైప్‌లైన్ నిర్మించి భారీ ట్యాంక్‌ను కూడా నిర్మించారు. నాలుగు వీధుల్లోనూ ఆరు కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు.

- ప్రారంభానికి సిద్ధమైన గ్రావిటీ పథకం
- నీటి శుద్ధి యంత్రాన్ని సమకూర్చిన రీడ్స్‌సంస్థ

**శుద్ధి యంత్రంతో రక్షిత నీరు :** ఏజెన్సీలో ఎక్కడా లేని విధంగా ఈ గ్రావిటీ పథకానికి నీటిని శుద్ధి చేసే భారీ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఈ నీటి శుద్ధి యంత్రానికి సుమారు ₹ 3లక్షలను ఖర్చు పెట్టింది. గ్రావిటీ పథకం నుంచి ట్యాంక్‌కు చేరే నీటినంతటిని శుద్ధి చేసేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ యంత్రంలోని రెండు విభాగాల్లో నీటిలోని మలినాలను తొలగించే ఇసుక రేణువులు ఉన్నాయని అక్కడ నుంచి శుద్ధి అయిన నీరు ట్యాంక్‌లోకి వెళుతుందని,అక్కడ కూడా క్లోరినేషన్ అవుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.వి. సత్యనారాయణ తెలిపారు. కొండ నుంచి వచ్చే నీరంతా శుద్ధి అయిన తరువాతే కుళాయిల ద్వారా సరఫరా అవుతుందని, ఏజెన్సీలో ఏ నీటి పథకానికి ఇలాంటి శుద్ధి యంత్రం లేదని ఆయన తెలిపారు.